
సాక్షి
ఖమ్మం
బుధవారం । 25 । అక్టోబర్ । 2023



అమ్మా.. మా కోట మైసమ్మా!

కారేపల్లి మండలం ఉసిరికాయపల్లిలో ఐదు రోజుల పాటు జరిగే కోటమైసమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా మొదలైంది. 10లో



మర్లపాడులో ఆయిల్‌పామ్..

రైతుల ఇబ్బందులు తీర్చేలా అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ ఆధ్వర్యాన మర్లపాడులో గెలల సేకరణ కేంద్రం ఏర్పాటుచేశారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
34° / 18°

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత ఎండ తగ్గి గంటగంటకు చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ముగిసిన శ్రీదేవి శరన్నవ రాత్రోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నరాత్రోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీవారికి అర్చకులు ప్రత్యేక పజలు చేయగా.. అలివేలు మంగ అమ్మవారిని శ్రీమహిషాసురమర్దని, శ్రీరాజరాజేశ్వరి దేవిగా దర్శనమిచ్చారు. ఆతర్వాత యాగశాలలో అర్చకులు మహా చండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల భక్తులు భారీగా హాజరై పూజలు చేశారు. ఇక సాయంత్రం శాస్త్రోక్తంగా అర్చకులు శమీపూజ నిర్వహించారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, ఉప్పల మురళీమోహన్‌శర్మ, రాజీవశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే



సభావేదిక మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కూసుమంచి: ఎన్నికల ప్రచారంలో భాగంగా పాలేరు నియోజకవర్గంలో ఈనెల 27న జరిగే ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. ఈసందర్భంగా జీళ్లచెరువులో 25 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఇక్కడ జరుగుతున్న పనులను ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. సభావేదిక, పార్కింగ్, హెలిప్యాడ్ ప్రాంతాలను పరిశీలించి సూచనలు చేయడమే కాక అధికారులతో చర్చించారు. ఎమ్మెల్యే వెంట వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్‌నాయకులు ఉన్నారు.

ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ వద్దిరాజు



విజయవాడలో ఎంపీ వద్దిరాజు దంపతులు

ఖమ్మంమయూరిసెంటర్: విజయదశమి పండుగ సందర్భంగా ఏపీలోని విజయవాడలో కనకదుర్గ అమ్మవారిని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై రాజరాజేశ్వరి దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని ఎంపీతో పాటు ఆయన సతీమణి విజయలక్ష్మి, కుమార్తె డాక్టర్ గంగాభవాని దర్శించుకోగా అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం అందజేశారు. ఆతర్వాత ఎంపీ రవిచంద్ర కుటుంబ సభ్యులతో కలిసి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతలపూడి సమీపంలోని ప్రగడవరం శివాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు 'పోలీసు' సైకిల్ ర్యాలీ

ఖమ్మంక్రైం: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పోలీసు శాఖ ఆధ్వర్యాన సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సీపీ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియం వద్ద ఈ ర్యాలీ ఉదయం ఆరు గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అక్కడి నుంచి ప్రకాష్‌నగర్‌లోని సీపీ కార్యాలయం వరకు కొనసాగే ర్యాలీలో నగర వాసులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సీపీ ఓ ప్రకటనలో కోరారు.

119కేసులు... రూ.2,86,06,772 సీజ్

ఖమ్మం సహకారనగర్: అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చా జిల్లాలో ఇప్పటి వరకు నిబంధనల ఉల్లంఘటనపై 119కేసులు నమోదు చేశారు. ఇందులో భాగంగా రూ.2,86,06,772 నగదును సీజ్ చేసినట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. అయితే, ఇందులో సరైన ఆధారాలు చూపించిన 95కేసులకు సంబంధించి రూ.1,90,83,080 నగదు విడుదల చేశామని కలెక్టర్ వెల్లడించారు.

తీర్పు మీదే.. భవిష్యత్ మీదే!



జిల్లాలో వయస్సుల వారీగా ఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు	కొత్త ఓటర్లు	20 నుంచి 29 ఏళ్లలోపు
11,96,293	44,204	2,33,272
30 నుంచి 39 ఏళ్లలోపు	**40 నుంచి 49 ఏళ్లలోపు**	**50 నుంచి 59 ఏళ్లలోపు**
3,31,552	2,33,928	1,79,867
60 నుంచి 69 ఏళ్లలోపు	**70 నుంచి 79 ఏళ్లలోపు**	**80 ఏళ్లు పైబడి**
1,05,781	50,928	16,761

రానున్న ఎన్నికల్లో యువతే కీలకం

- జిల్లాలో కొత్త ఓటర్లు 44,204 మంది
- వీరందరూ 18 ఏళ్లు నిండి 19 ఏళ్లలోపు వారే
- ఓటర్ల నమోదు ప్రత్యేక డ్రైవ్‌తో సత్ఫలితాలు
- యువతీ, యువకుల ఓట్లు రాబట్టేందుకు పార్టీల ప్రణాళిక

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రానున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఖమ్మం జిల్లాలో యువ ఓటర్ల తీర్పు కీలకం కానుంది. అభ్యర్థుల గెలుపోటముల్లో వీరు నిర్ణయాత్మక పాత్ర పోషించనున్నారు. దీంతో కొత్త ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతారోననే ఆసక్తి నెలకొంది. అర్హులైన కొత్త ఓటర్ల నమోదుపై కలెక్టర్, అధికారులు ప్రత్యేక దృష్టి సారించగా 44,204 మంది యువ ఓటర్లు ఓటు హక్కు పొందారు. కొత్త వారితో కలిపి 29 ఏళ్లలోపు వయసు కలిగిన ఓటర్లు 2,77,476 మంది ఉండగా... వీరిని ఆకట్టుకునేలా ప్రచార ప్రణాళికలను పార్టీల నేతలు రూపొందిస్తున్నారు.

నమోదుకు ప్రత్యేక డ్రైవ్

జిల్లాలో నూతన ఓటర్ల నమోదుకు అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రామాలు, పట్టణాల్లోనే కాక కళాశాలల్లో విస్తృత ప్రచారం చేశారు. దీంతోపాటు కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యాన నూతన ఓటరు నమోదు, సవరణ, పేర్ల మార్పు తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సహా అధికార యంత్రాంగం పర్యవేక్షించింది.

యువ కెరటాలు

ఈసారి అర్హులైన యువతీ, యువకులంతా ఓటరు నమోదు కోసం ఆసక్తి కనబరిచారు. జిల్లాలో 11,96,293 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో నూతనంగా 44,204 మంది కొత్తగా ఓటు హక్కు పొందిన 18 ఏళ్లు నిండి 19 ఏళ్లలోపు వారే. మొత్తం ఓటర్లలో వీరిది మూడు శాతం కాగా, ఖమ్మం నియోజకవర్గంలో అత్యధికంగా 12,025 మంది, ఆ తర్వాత పాలేరులో 9,066 మంది ఓటు నమోదు చేసుకున్నారు. అలాగే 29 ఏళ్లలోపు ఓటర్లు 2,77,476 మంది ఉండగా.. మొత్తం ఓటర్లలో వీరు 23 శాతంగా ఉన్నారు. ఇక 39 ఏళ్లలోపు ఉన్న ఓటర్లు 6,09,028 మంది(50 శాతం) ఉన్నట్లు జాబితా ద్వారా వెల్లడైంది.

ఫలితాలపై ప్రభావం

ఈ ఎన్నికల ఫలితాలపై యువత ప్రభావం అత్యధికంగా ఉంటుందని రాజకీయ పార్టీలు విశ్లేషిస్తున్నాయి. నూతనంగా ఓటు వేసే వారితోపాటు 39 ఏళ్లలోపు ఉన్న ఓటర్లు ఫలితాలను శాసిస్తారని భావిస్తుండగా.. కొత్త, యువ ఓటర్లు అన్ని పరిస్థితులపై ఒక అంచనాకు వచ్చాకే ఓటు వేస్తారని చెబుతున్నారు. అయితే, నూతన ఓటర్ల విషయంలో అంచనాకు రావడం పార్టీలకు కష్టంగా మారగా... ఎలాగైనా అత్యధికంగా ఓట్లు రాబట్టేలా పార్టీల్లో చర్చలు జరుగుతున్నాయి. జిల్లాలో ఫలితాలను తారుమారు చేయగల స్థాయిలో యువ ఓటర్లు ఉండటంతో వారి కేంద్రంగానే పార్టీలు ప్రచారం మొదలుపెట్టాయి. తమ పార్టీల్లోని యువ నాయకులను రంగంలోకి దించి తాము అధికారంలోకి వస్తే యువత కోసం చేసే పనులను వివరిస్తున్నారు.

జంగ్ తెలంగాణ

ప్రజాసేవకుడికే ఓటు..



ప్రజలకు సేవచేసే అభ్యర్థికే నా ఓటు వేస్తా. మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్నా. అందుకే సరైన అభ్యర్థిని ఎన్నుకునేందుకు ఓటు హక్కు ఉపయోగిస్తా. అందరు కూడా ప్రలోభాలకు లొంగకుండా అభ్యర్థిని ఎన్నుకోవాలి.
– పగడాల అశ్విని, మత్కేపల్లి, చింతకాని మండలం

గర్వంగా ఉంది..



రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును మొదటిసారి ఉపయోగించుకోనుండడం గర్వంగా ఉంది. ప్రలోభాలకు లొంగకుండా మంచి అభ్యర్థికి ఓటు వేస్తా. ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుని, సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే వారికే నా ఓటు.
– కొల్లి వెంకటేష్, మత్కేపల్లి, చింతకాని మండలం

ఉత్సాహంతో ఉన్నాను.



మొదటిసారి ఓటు వేయడానికి ఉత్సాహంగా చూస్తున్నా. ఐదు నెలల క్రితమే దరఖాస్తు చేసుకోగా ఓటు హక్కు వచ్చింది. మంచి అభ్యర్థి ఎవరో, ప్రజలకు మేలు చేసేది ఎవరో వివరాలు తెలుసుకున్నాకే ఓటు వేస్తా. నా ఓటు ఎవరికీ అమ్ముకోను.
– సూరంపల్లి నవీన్, కొణిజర్ల

సిరా చుక్క చూసుకోవాలనుంది..



ప్రజల భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికల్లో తొలిసారి ఓటు వేస్తున్నానని సంతోషంగా ఉంది. ఎప్పుడు నా వేలిపై సిరా చుక్క చూసుకుందామా అని ఎదురు చూస్తున్నా. ప్రజలకు అన్ని విధాలుగా మంచి చేసే వ్యక్తిని ఎన్నుకోవడం మన బాధ్యత.
– మొగిలి శ్రీలక్ష్మి, కొణిజర్ల

రూ.15.04 లక్షల నగదు సీజ్

ఖమ్మంలోనే రూ.5.29లక్షలు



ఖమ్మంక్రైం: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యాన డబ్బులు, మద్యం అక్రమంగా తరలించకుండా పోలీసులు విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఈమేరకు జిల్లాలో సోమ, మంగళవారాల్లో కలిపి రూ.15.04లక్షలకు పైగా నగదును సీజ్ చేశారు. ఇందులో భాగంగా ఖమ్మంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు మంగళవారం రాత్రి తనిఖీలు చేశారు. ఈసందర్భంగా సరైన పత్రాలు లేకుండా వేర్వేరు వాహనాల్లో తరలిస్తున్న రూ.5,29,030 నగదును సీజ్ చేశామని త్రీటౌన్ పోలీసులు వెల్లడించారు. ఈ నగదు వ్యాపారులకు చెందినదిగా తెలిసింది.

- **వేంసూరు :** వేంసూరు మండలం వెంకటాపురంలోని చెక్ పోస్ట్ వద్ద సోమవారం ఎస్ఐ వీరప్రసాద్ ఆధ్వర్యాన తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా నాలుగు వాహనాల నుంచి ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.5.50 లక్షల నగదును సీజ్ చేశామని తెలిపారు.
- **కామేపల్లి:** మండలంలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన ముత్యం రామకృష్ణ ద్విచక్ర వాహనం నుంచి రూ.2లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుస్టేషన్ సమీపాన ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన వాహనాల తనిఖీ చేపట్టగా రామకృష్ణ వాహనంలో పరిశీలించారు. ఆయన వద్ద నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.
- **రఘునాథపాలెం:** ఎలాంటి ఆధారాలు లేకుండా ఓ వ్యక్తి తీసుకెళ్తున్న రూ.1.50లక్షల నగదును సీజ్ చేసినట్లు రఘునాథపాలెం పోలీసులు తెలిపారు. ఖమ్మం రూరల్ మండలంలోని గోళ్లపాడుకు చెందిన డి.ఉప్పలయ్య ఆధారాలు లేకుండా తీసుకెళ్తుండగా వాహన తనిఖీల్లో భాగంగా పట్టుబడడంతో సీజ్ చేశామని వెల్లడించచారు.
- **ఏన్కూరు:** ఎన్నికల తనిఖీల్లో భాగంగా పోలీసులు ఓ వ్యక్తి నుండి రూ.75 వేలను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనాల తనిఖీలో భాగంగా కోడిగుడ్ల వ్యాన్‌ను తనిఖీ చేయగా నగదు లభించింది. అయితే, సదరు వ్యక్తి వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదు సీజ్ చేశామని ఎస్ఐ బాదావత్ రవి తెలిపారు.

ఆనందాలను పంచిన దసరా!





జమ్మిబండపై స్వామిని దర్శించుకుంటున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, తదితరులు (ఇన్‌సెట్) దహనమవుతున్న రావణాసురుడి ప్రతిమ

- ఘనంగా విజయదశమి వేడుకలు, శమీ పూజ
- పలు ప్రాంతాల్లో రావణాసుర దహనం
- జమ్మిబండ వద్ద ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి పువ్వాడ

ఖమ్మంగాంధీచౌక్: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా పండుగను సోమవారం జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఉత్సాహంగా, సంప్రదాయ పద్ధతుల్లో విజయదశమి పండుగను జరుపుకోగా... ఆలయాలను సందర్శించారు. అలాగే, దసరాకు ప్రత్యేకమైన శమీ పూజలు చేశారు. ఖమ్మం నగరంలోని జమ్మిబండపై, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో వేడుకలు ప్రత్యేకంగా జరిగాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు బారులు తీరగా ఇబ్బందులు ఎదురుకాకుండా బారికేడ్లు, క్యూలైన్ల వంటి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని ఖమ్మం శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం, శ్రీగుంటుమల్లేశ్వరస్వామి ఆలయం, శ్రీ వేంకటేశ్వర స్వామి, భక్త ఆంజనేయ స్వామి తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇక దసరా రోజు శమీ పూజ చేస్తే మంచి ఫలితాన్నిస్తుందని, బంగారం కురిపిస్తుందనే నమ్మకంతో భక్తులు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు మదిలో కోర్కెలను కాగితంపై రాసి మొక్కుకున్నారు.

జమ్మిబండపై వేడుకగా...

ఖమ్మం నగర నడిబొడ్డున ఉన్న గుట్టపై వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గుట్టపై ఉన్న ఆలయం నుంచి స్వామి వారిని పల్లకీ సేవగా మేళతాళాల నడుమ జమ్మిబండపైకి తీసుకొచ్చారు. ఈ పల్లకీసేవలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే, జమ్మిబండపై మంత్రి అజయ్‌కుమార్ తన కుటుంబంతో సహా పూజలు చేశారు. ఆతర్వాత రావణాసురుడి ప్రతిమపై బాణం వేసి దహనం చేశారు. కాగా, జమ్మిబండపై శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి నగర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో పురవీధులు కిటకిటలాడాయి. ఈసందర్భంగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఖమ్మం ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి స్వామి వారి పారువేట సేవ, శమీ పూజ నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నానని... పారువేటలో పాల్గొనడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని వెల్లడించారు. స్వామి దయతో జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయగలుగుతున్నామని పువావడ చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, దేవస్థాన కమిటీ ప్రతినిధులు గోలి వెంకటేశ్వర్లు, అనూష్, స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాలకు ఈవీఎంలు

- ఇప్పటికే సిద్ధం చేసిన స్ట్రాంగ్ రూంలకు తరలింపు
- పర్యవేక్షించిన కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్

ఖమ్మం సహకారనగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కీలకమైన ఈవీఎంలను నియోజకవర్గాల వారీగా తరలించే ప్రక్రియ చేపట్టారు. ఈమేరకు పార్టీ ప్రతినిధుల సమక్షాన ఖమ్మం జెడ్పీ కార్యాలయ ఆవరణలోని స్ట్రాంగ్ రూం తాళాలను మంగళవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ తెరిచారు. ఇక్కడి నుంచి ఐదు నియోజకవర్గ కేంద్రాల్లో ఎంపిక చేసిన గోదాంలకు ఈవీఎంలు, సీయూలు, వీవీ ప్యాట్లు తరలించారు. ఈసందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 20న మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తిచేశామని తెలిపారు. ఇందులో భాగంగా ఓటింగ్ యంత్రాలను నియోజకవర్గాల వారీగా ప్రత్యేక భద్రత నడుమ తరలించినట్లు వెల్లడించారు.

ఎక్కడెక్కడకు...

నియోజకవర్గాల వారీగా ఇప్పటికే ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూంలను గుర్తించారు. ఆయా భవనాల్లో భద్రతకు సంబంధించి ఏర్పాట్లు కూడా పూర్తిచేశారు. ఈమేరకు ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించి ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్, పాలేరు నియోజకవర్గంలోని కిట్స్ కళాశాల, మధిరలోని మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వైరాలోని వైరా సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, సత్తుపల్లిలోని జ్యోతి నిలయం హైస్కూళ్లలో స్ట్రాంగ్ రూంలు ఏర్పాటుచేశారు. ఇక్కడకు ఈవీఎంలు చేరుకున్నాక త్వరలోనే రెండో దశ ర్యాండమైజేషన్ చేపట్టనున్నారు. అనంతరం అక్కడి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా పోలింగ్‌కు ఒక రోజు ముందు ఉద్యోగులకు ఈవీఎంలను అందజేస్తారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, అదనపు డీసీపీ ప్రసాద్ రావు, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డీటీఓ సత్యనారాయణ, ఆర్‌టీఓ టి.కిషన్‌రావు, ఆర్డీఓలు జి.గణేష్, అశోక్‌చక్రవర్తి, ఎస్డీసీ రాజేశ్వరి, ఖమ్మం టౌన్ ఏసీపీ హరికృష్ణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబుతో పాటు వివిధ పార్టీల ప్రతినిధులు గుండాల కృష్ణ, తిరుమలరావు, విద్యాసాగర్, ఆర్.ప్రకాష్, బాలగంగాధరతిలక్, కె.కరుణాకర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో ఈవీఎంల భద్రతను పరిశీలిస్తున్న ఆర్ఓ ఆదర్శ్‌సురభి

కానిస్టేబుల్ వైద్యపరీక్షలు వాయిదా

ఖమ్మంక్రైం: పోలీస్ కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో భాగంగా ఎంపికైన అభ్యర్థులకు బుధవారం నుంచి జిల్లాలో వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే, రాష్ట్ర పోలీస్ నియామక మండలి సూచనల మేరకు ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు సీపీ విష్ణు ఎస్.వారియర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని ఆయన సూచించారు.

వంద రోజుల్లో హామీలన్నీ నెరవేరుస్తాం

- అంతిమ యుద్ధంలో గెలిచేది ప్రజలే
- ఆత్మీయ సమ్మేళనంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- పాల్గొన్న తుమ్మల, పొంగులేటి



సమ్మేళనంలో పాల్గొన్న సీఎల్పీ నేత భట్టి, మాజీ మంత్రి తుమ్మల తదితరులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపే ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం వైఎస్సార్ నగర్‌లో కార్పొరేటర్ లకావత్ సైదులు అధ్యక్షతన మంగళవారం సాయంత్రం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కష్టసమయాన పార్టీ జెండా మోసిన అందరికీ రుణపడి ఉంటామన్నారు. అయితే, ఇప్పుడు అందరి ముందు పెనుసవాల్ ఉన్నందున స్వీకరించి రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరముందని తెలిపారు. దొరల తెలంగాణకు, ప్రజల తెలంగాణకు మధ్య జరుగుతున్న యుద్ధంలో అంతిమంగా ప్రజలే గెలవాలన్నారు. ఇక ఖమ్మం జిల్లాలో అరాచకపాలన సాగుతున్నందున కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మెన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇక్కడి బీఆర్ఎస్ అభ్యర్థి ఎన్నికలప్పుడు ఎలా ఉంటాడో, ఆతర్వాత ఎలా ఉంటాడో అందరికీ తెలుసన్నారు. గతంలో స్వపక్షంలో ఉన్న తమపైనే కేసులు నమోదయ్యాయంటే ప్రతిపక్షం పరిస్థితి అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్నందున శ్రేణులు నిరంతరం కార్యక్షేత్రంలో ఉండి లక్ష్యాన్ని సాధించుకోవాలన్నారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం నగరాన్ని కార్పొరేషన్‌గా చేసింది కాంగ్రెస్ పార్టీయేనని తెలిపారు. ఇక్కడ అరాచక, అవినీతి పాలనను అంతమొందించేందుకు తాను పోటీ చేస్తున్నానని వెల్లడించారు. అక్రమ కేసులు పెట్టిన పోలీసులే ఇంటికి వచ్చి కేసులు కొట్టేస్తామని బ్రతిమాడేలా చేస్తామని తెలిపారు. ఈ సమ్మేళనంలో కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణతో పాటు డి.సౌజన్య, మలీదు వెంకటేశ్వర్లు, మిక్కిలినేని మంజుల, చావా మాధురి, నారాయణరావు, నరేందర్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతిభ చాటిన వెయిట్ లిఫ్టర్లు



పతకాలు గెలుచుకున్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర స్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో ఖమ్మంకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో సబ్ జూనియర్ 59 కేజీల విభాగంలో వంశీ ప్రథమ, 74 కేజీల్లో గోపీచంద్ తృతీయ, జూనియర్స్ విభాగం 66 కేజీల కేటగిరీలో అఖిల్ ద్వితీయ, 84 కేజీల కేటగిరీలో వి.సాయికుమార్ ప్రథమ, జూనియర్స్ 74 కేజీల కేటగిరిలో వివేక్, 83 కేజీ సాయికుమార్, 66కేజీల విభాగంలో పి.పవన్ ప్రథమ స్థానం పొందారు. వీరిని క్లాసిక్ జిమ్ నిర్వాహకులతో పాటు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ బాధ్యులు సీహెచ్.మనోజ్ కుమార్చౌదరి, నగీన మనోచౌదరి అభినందించారు.

హెచ్‌సీఏ జట్టులో ఖమ్మం క్రికెటర్



బి.నవీన

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఇటీవల నిర్వహించిన అండర్–19 ఎంపిక పోటీల్లో ఖమ్మం జిల్లా నుంచి పాల్గొన్న బి.నవీన ప్రతిభ చాటగా జట్టులో స్థానం సాధించింది. అండర్–19 విభాగంలో జరిగే జాతీయస్థాయి క్రికెట్ టోర్నీలో హెచ్‌సీఏ జట్టు తరఫున ఆమె ఆడనుంది. ఈసందర్భంగా నవీనను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్‌లు ఎండీ.మతిన్, ఎండీ.గౌస్, అక్బర్ అలీతో పాటు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ తదితరులు అభినందించారు.

ఆలయానికి రూ.3 లక్షల విలువైన శ్రీరామరథం



శ్రీనివాసాచారి బహూకరించిన రథంతో భక్తులు

తల్లాడ: తల్లాడ మండలం రామానుజవరం గ్రామానికి చెందిన చిట్యాల శ్రీనివాసాచారి రాముడిపై ఉన్న అంచంచల భక్తితో శ్రీరామరథాన్ని సొంతంగా తయారుచేశారు. గ్రామంలోని కోదండ రామాలయంలో ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లేందుకు గాను ఆయన రెండు నెలల పాటు శ్రమించి రథాన్ని సిద్ధం చేశారు. ఇందుకోసం రూ.3 లక్షల విలువైన టేకు చెక్క ఉపయోగించినట్లు తెలిపారు. ఈమేరకు రథాన్ని ఆలయ కమిటీకి మంగళవారం అప్పగించగా శ్రీనివాసచారి – సావిత్రి దంపతులను బాధ్యులు సన్మానించాక శ్రీరామరథంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

రూ.65వేలు పలికిన అమ్మ వారి లడ్డూ

ఏన్కూరు: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో కొలువుదీరిన కనకదుర్గమ్మ వద్ద పూజలు అందుకున్న లడ్డూకు మంగళవారం వేలం నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపులో భాగంగా ప్రధాన సెంటర్‌లో లడ్డూ పాట ఏర్పాటు చేయగా, రైతుబంధు కన్వీనర్ మేడ ధర్మారావు రూ.65,500కు దక్కించుకున్నారు. గత ఏడాది లడ్డూ ధర రూ.30 వేలే పలకగా ఈసారి రెట్టింపు కావడం విశేషం.

నాలుగు ప్రచార వాహనాలు సీజ్



వాహనాల పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: ఎలాంటి అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారంలో వినియోగిస్తున్న నాలుగు వాహనాలను అధికారులు సీజ్ చేశారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ వాహనం, డీజేపీ వాహన పత్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వేణుమనోహర్ తనిఖీ చేశారు. అయితే, నాయకుల వద్ద అనుమతి పత్రాలు లేకపోవటంతో సీజ్ చేశారు. అలాగే, కాంగ్రెస్ పార్టీకి చెందిన రెండు ప్రచార వాహనాలను బైరవునిపల్లిలో సీజ్ చేసిన అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

రూ.15వేల విలువైన మద్యం పట్టివేత

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు, బస్వాపురం గ్రామాల షాపుల్లో పోలీసులు మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ప్రొద్దుటూరులో రూ.10,890, బస్వాపురంలో రూ.4,158 విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని దుకాణదారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,231

అమ్మా.. మా కోట మైసమ్మా!

భక్తజనంతో పోటెత్తిన శ్రీ కోటమైసమ్మ జాతర

- దసరా సందర్భంగా మొదలైన కోలాహలం



శ్రీకోటమైసమ్మ తల్లి జాతర వ్యూ

కారేపల్లి: కొలిచిన వారికి కొంగు బంగారమై, భక్తులు కోరిన కోర్కెలు తీర్చే శ్రీకోటమైసమ్మ తల్లి జాతర మొదలైంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో జాతర ప్రాంగణం పోటెత్తింది. అమ్మా మైసమ్మా.. మా కోట మైసమ్మా... అంటూ బారులుదీరి తల్లిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు.

భారీగా భక్తజనం

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం – భద్రాద్రి జిల్లా ఇల్లెందు పట్టణానికి సరిహద్దులో ఉన్న ఉసిరికాయపల్లి గ్రామంలో కొలువు దీరిన శ్రీకోటమైసమ్మ తల్లి జాతర దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మొదలుకాగా ఐదు రోజుల పాటు జరగనుంది. సోమవారం రోజు అంతంత భక్తుల తాకిడి కాస్త తక్కువగానే ఉన్న మంగళవారం మాత్రం వేలాదిగా తరలివచ్చారు. కారేపల్లి, కామేపల్లి మండలాలతో పాటు సరిహద్దు జిల్లాలైన భద్రాద్రి జిల్లా ఇల్లెందు, టేకులపల్లి, మహబూబాబాద్ జిల్లా గార్ల, బయ్యారం, డోర్నకల్ మండలాల నుంచి భక్తులు వచ్చి తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కాగా, ఉసిరికాయపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రభబండ్లతో ఒక రోజు ముందుగానే చేరుకుని బస చేశారు. ఇక జాతరలో ఏర్పాటు చేసిన సోలాపూర్ వారి సర్కస్, జెయింట్ వీల్స్ వద్ద చిన్నాపెద్ద తేడా లేకుండా ఆనందంతో గడిపారు.



కోటమైసమ్మ దర్శనానికి క్యూ కట్టిన భక్తులు



వాహన పూజ చేస్తున్న అర్చకుడు

దేవాదాయ శాఖ, ట్రస్ట్ ఆధ్వర్యాన ఏర్పాట్లు

జాతరకు వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభి రామారావు ఆధ్వర్యాన అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే, ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి, కామేపల్లి ఎస్‌ఐలు పుష్పాల రామారావు, ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

ఇందిరమ్మ రాజ్యస్థాపనకు కృషిచేద్దాం



కూసుమంచి సర్పంచ్ మోహన్, నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరెడ్డి

- బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఇక చెల్లుచీటి
- కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: తొమ్మిదిన్నరేళ్ల పాలించిన బీఆర్‌ఎస్‌కు ఇక చెల్లుచీటియేనని, రాష్ట్రంలో రాబోయేది ఇందిరమ్మ రాజ్యమేనని కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని పాలేరు, కూసుమంచిల్లో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ కేసీఆర్ మాయమాటలు నమ్మి ఇంతకాలం మోసపోయిన వారంతా ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలన్నీ నెరవేరుస్తుందని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మట్టె గురవయ్య, నాయకులు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, జూకూరి గోపాలరావు, కె.వెంకటరత్నం, హఫీజుద్దీన్, పీర్యానాయక్, ఎడవెల్లి రాంరెడ్డి, రవికుమార్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి సర్పంచ్ సహా పలువురు చేరిక

కూసుమంచి/నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: కూసుమంచి సర్పంచ్, బీఆర్‌ఎస్‌కు చెందిన చెన్నా మోహన్‌రావు కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం రాత్రి ఆయనకు శ్రీనివాసరెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. అలాగే, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ.అహ్మద్ అలీ, మాజీ సర్పంచ్ గుండా దామోదర్‌రెడ్డి కూడా పార్టీలో చేరారు. ఇక నేలకొండపల్లి మండలంలోని మంగాపురంతండాకు చెందిన ఎంపీటీసీ తేజావత్ అరుణ, రాజారాంపేట సొసైటీ వైస్‌చైర్మన్ ధరావత్ బాలాజీ, వార్డు సభ్యులు శ్యామిలి, భారతితో పాటు బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు తేజావత్ కోటేశ్వరరావు, గోబ్రియా, వీరన్న, వంశీ, తదితరులు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు ధరావత్ కోటేశ్వరరావు, నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, సీత్యా, బాలాజీ, వెన్నపూసల సీతారాములు, కె.హన్మంతరావు, యడవల్లి సైదులు పాల్గొన్నారు. ఇంకా తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణి ఎంపీటీసీ గుగ్గిళ్ల అంబేద్కర్‌తో పాటు సైపుద్దీన్, బత్తుల రవికుమార్, రాజేంద్రప్రసాద్, నరేష్ తదితరులు పొంగులేటి సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మొన్న కాంగ్రెస్‌లోకి.. తిరిగి బీఆర్‌ఎస్‌లోకి !

రఘునాథపాలెం: ఎన్నికల సమీపిస్తున్న వేళ ఎదుటి పార్టీ నేతలను ఆకర్షించడంలో ప్రధాన పార్టీల నాయకులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, ఒక పార్టీ నుంచి ఇంకో పార్టీలో చేరుతున్న వారు మళ్లీ ఒకటి, రెండు రోజుల్లోనే సొంత గూటికి చేరుతుండడం గమనార్హం. రెండు రోజుల క్రితం రఘునాథపాలెం మండలంలోని బీఆర్‌ఎస్‌కు చెందిన వివిధ గ్రామాల సర్పంచ్‌లు భుక్యా శరత్, సక్రాం నాయక్, జీజామత్రు తదితరులు కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల సమక్షాన కాంగ్రెస్ పార్టీలో చేరారు. తిరిగి వీరు మంగళవారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కలిసి మళ్లీ గులాబీ కండువాలు కప్పుకున్నారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరూనాయక్, నాయకులు పాల్గొన్నారు.



రెండు రోజుల క్రితం పొంగులేటి, తుమ్మల సమక్షాన కాంగ్రెస్‌లో చేరుతున్న సర్పంచ్‌లు



మంత్రి పువ్వాడ సమక్షాన గులాబీ కండువాలు కప్పుకుంటున్న దృశ్యం

మర్లపాడులో ఆయిల్‌పామ్ కలెక్షన్ సెంటర్

వేంసూరు: వేంసూరు మండలంలోని మర్లపాడులో తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యాన ఆయిల్‌పామ్ గెలల కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభించారు. గ్రామంలోని శ్రీ శ్రీనివాస వే బ్రిడ్జిలో ఈ సెంటర్‌ను ఆయిల్‌ఫెడ్ డివిజన్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. మర్లపాడులోని సెంటర్ ద్వారా ప్రతీ సోమవారం ఆయిల్‌పామ్ గెలలు సేకరించి అశ్వారావుపేటలోని ఫ్యాక్టరీకి తరలిస్తామని తెలిపారు. రైతులకు దూరాభారం తప్పించేలా ఏర్పాటుచేసిన ఈ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజర్ జి.కళ్యాణ్‌గౌడ్, జిల్లా మేనేజర్ జేవీఎస్‌డీ.భారతి, ఫీల్డ్ ఆఫీసర్లు కృష్ణారావు, నవ్య, నాగలక్ష్మితోపాటు బండి గురవారెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, గంద్ర సోమిరెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు, మందపాటి కేశవరెడ్డి, నరోత్తమరెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సెంటర్‌లో ఆయిల్‌ఫెడ్ డీఓ, తదితరులు

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



పార్టీలో చేరిన వారితో భట్టి విక్రమార్క

సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క

బోనకల్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని రాపల్లిలో బీఆర్‌ఎస్ నుండి 50 కుటుంబాలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరగా భట్టి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలుచేసి తీరుమతాన్నారు. బీఆర్‌ఎస్ రైతులకు సకాలంలో రుణమాఫీ చేయకుండా మోసం చేయగా.. కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుందని ఆరోపించారు. కాగా, సాగర్ నీరు రాక పంటలు ఎండిపోతున్నాయని స్థానిక రైతులు భట్టి దృష్టికి తీసుకెళ్లారు. ఈసమావేశంలో జెడ్పీటీసీ మొదుగు సుధీర్‌బాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావుతో పాటు కర్నాటి కోటి, పైడిపల్లి కిషోర్, భద్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

● లండన్‌లో బతుకమ్మ !



లండన్‌లో స్థిరపడిన తెలంగాణ వాసులు సంప్రదాయాలను మరిచిపోకుండా ఘనంగా బతుకమ్మ జరుపుకున్నారు. ఈ వేడుకల్లో మధిరకు చెందిన చల్లా అనూష తదితరులు పాల్గొన్నారు. – మధిర

ఎన్నికలకు సిద్ధం కండి

సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్న ప్రభుత్వాలను గద్దె దింపేలా వచ్చే ఎన్నికలను ఎదుర్కొనేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ సీపీఐ కౌన్సిల్ కార్యవర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. కేంద్రంలోని బీజేపీ మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు యత్నిస్తూ రాజకీయ లబ్ధి పొందుతోందని ఆరోపించారు. ఈక్రమంలో ఆ పార్టీని ఓడించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రధానమైన సమస్యలను పక్కదారి పట్టించి తెలంగాణ ప్రజలను మోసం చేసే రీతిలో వ్యవహరిస్తుందని చెప్పారు. దీంతో బీఆర్‌ఎస్, బీజేపీకి వ్యతిరేకంగా కార్యకర్తలను సన్నద్ధం చేసే క్రమంలో ఈనెల 27 నుంచి నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోటు ప్రసాద్

ప్రచారంలో పాల్గొన్న హాస్టల్ కూలీ సస్పెండ్

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురం తండాకు చెందిన తేజావత్ రాజు ముదిగొండ మండలంలోని గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. ఈనెల 13న మంగాపురంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించగా అందులో రాజు పాల్గొన్నాడు. ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకుని ప్రచారం చేశాడని బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి కె.జమలారెడ్డి విచారణ చేపట్టి పాలేరు రిటర్నింగ్ అధికారి రాజేశ్వరికి నివేదిక ఇచ్చారు. ఈ నివేదిక ఆధారంగా రాజును సస్పెండ్ చేస్తూ గిరిజన సంక్షేమ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

టీఎన్జీవోస్ కార్యవర్గంలో పలువురికి స్థానం

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ జిల్లా కార్యవర్గంలో పలువురికి స్థానం కల్పించారు. ఖమంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్.సాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం రూరల్ యూనిట్ కార్యదర్శి ఆర్ఐ కేవీవీ.ప్రసాద్‌ను నియమించినట్లు తెలిపారు. అలాగే, టౌన్ ఉపాధ్యక్షుడిగా బి.రజినీకాంత్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అన్వర్, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా వసంత, టౌన్ సంయుక్త కార్యదర్శిగా ఝాన్సీ, జిల్లా కార్యాలయ కార్యదర్శిగా పురుషోత్తమరెడ్డి, క్రీడా కార్యదర్శిగా వజీరుద్దీన్, జిల్లా మహిళా ఉపాధ్యక్షులుగా ఎ.జ్యోతి, జిల్లా పబ్లిసిటీ కార్యదర్శిగా వై.శ్రీనివాసరావును నియమించామని వెల్లడించారు. ఈసమావేశంలో నాయకులు నందగిరి శ్రీను, జీ.ఎస్.ప్రసాద్‌రావు, భాగం పవన్, చంద్రశేఖర్‌రావు, శాబాసు జ్యోతి, నాగుల్‌మీరా, సాయి శిరణ్మయి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



నియమితులైన వారిని సన్మానిస్తున్న అఫ్జల్‌హసన్

బస్సులో నగదు, బంగారం బ్యాగ్ మాయం

నేలకొండపల్లి: ఆర్టీసీ బస్సులో పొరపాటుగా ఒకరి బ్యాగ్ మరొకరు తీసుకెళ్లగా.. అందులో బంగారం, నగదు ఉండడంతో బాధిత ప్రయాణికురాలు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ఖమ్మంకు చెందిన ఓ కుటుంబం సోమవారం సూర్యాపేట జిల్లా కోదాడలోని జరిగిన శుభకార్యానికి హాజరై తిరిగి వస్తున్నారు. వీరి బస్సులోనే మరో ప్రయాణికురాలు కూడా ఎక్కగా నేలకొండపల్లిలో ఆమె దిగింది. అయితే, తన బ్యాగ్‌కు బదులు కోదాడ వెళ్లి వస్తున్న వారి బ్యాగ్ తీసుకెళ్లింది. అందులో నగదు, బంగారం ఉండడంతో ఖమ్మం వెళ్లాక గుర్తించిన వారు నేలకొండపల్లిలో దిగిన ప్రయాణికురాలిపై అనుమానంతో నేలకొండపల్లి పోలీసులను ఆశ్రయించారు. అయితే, ఖమ్మం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించినట్లు తెలిసింది. ఈ విషయమై నేలకొండపల్లి ఎస్సై బి.సతీష్‌ను వివరణ కోరగా....బాధితులు తమను కలిసిన విషయం నిజమే అయినా, పరిధి తమది కాకపోవడంతో ఖమ్మంలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారని తెలిపారు.

కొండచిలువ నుంచి తప్పించుకున్న రైతులు



హతమైన కొండ చిలువతో రైతులు

నేలకొండపల్లి: పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతులను భారీ కొండ చిలువ పరుగులు తీయించింది. మండలంలోని బైరవునిపల్లికి చెందిన రైతులు చల్లా నాగరాజు, లింగం నాగేశ్వరరావు, మల్లెబోయి న వీరబాబు మంగళవారం రాత్రి పొలాలకు నీరు పెట్టేందుకు బుద్దారం మేజర్ కాల్వ వద్దకు వెళ్లారు. కాల్వలో అప్పటికే ఉన్న కొండ చిలువను గమనించకపోగా నీటిని మళ్లించే సమయాన అది రైతుల వైపు దూసుకొచ్చింది. దీంతో మిగతా రైతులను పిలిచి కొండ చిలువను కాల్వలోనే కొట్టి చంపారు.

తాగునీటి కోసం వెళ్లి.. బావిలో పడి మృతి

కారేపల్లి: ప్రమాదవశాత్తు బావిలో పడిన మేకల కాపరి మృతి చెందిన ఘటన మండలంలోని విశ్వనాథపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వనాథపల్లికి చెందిన ఏనుగు జోగయ్య(60) భార్య కమలమ్మతో కలిసి మేకలు మేపేందుకు సమీపాన చేన్ల వైపు వెళ్లారు. మధ్యాహ్న భోజనం తర్వాత జోగయ్య తాగునీటి కోసం ర్యాంప్ ఉన్న(దిగుడు ఉన్న) వ్యవసాయ బావిలోకి దిగాడు. ఈక్రమంలో జారి పడిన ఆయన నీట మునిగి మృతి చెందాడు. అయితే, జోగయ్య ఎంతకు రాకపోవటంతో కలలమ్మ సమీప రైతులకు చెప్పగా వారు బావిలో వెతికినా దొరకలేదు. చివరకు ఇల్లెందు అగ్నిమాపక శాఖ కేంద్రానికి ఫోన్ చేయగా చేరుకున్న సిబ్బంది గాలించడంతో జోగయ్య మృతదేహం లభించింది. ఆయనకు భార్య కమలమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉండగా, కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్ఐ పి.రామారావు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

చింతకాని: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన దుగ్గి స్వామి(48) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకాని మండలం అనంతసాగర్ గ్రామానికి సోమవారం ద్విచక్ర వాహనంపై వచ్చిన స్వామి తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో జగన్నాథపురం సమీపాన ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారిపై ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో స్వామి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనం వెనుకాల కూర్చున్న మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. అలాగే, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు పల్టీలు కొట్టి పక్కనే ఉన్న గొయ్యిలో పడడడంతో అందులో ఉన్న ఖమ్మం వాసికి సైతం గాయాలయ్యాయి. ఘటనాస్థలాన్ని వైరా సీఐ సాగర్, ఎస్సై రాజేందర్ పరిశీలించారు. కాగా, మృతుడు స్వామికి భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, ఆయన కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

మఫ్టీలో వెళ్లి తనిఖీలు నిర్వహించిన పోలీసులు

వైరారూరల్: కోడిపందేల స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై మేడా ప్రసాద్ కథనం మేరకు.. మండలంలోని లింగన్నపాలెం శివార్లలో సోమవారం పలువురు కోడి పందేలు ఆడుతున్నారనే సమాచారంతో ఎస్సై, తన సిబ్బందితో కలిసి మఫ్టీలో తనిఖీలు చేపట్టారు. ఈమేరకు కోడి పందేలు ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుండి రూ.15,500 నగదు, రెండు కోడి పుంజులు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో లారీ నడిపిన క్లీనర్

కారేపల్లి: మద్యం మత్తులో క్లీనర్ లారీని నడిపి ఓ వ్యక్తికి ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. మండలంలోని భాగ్యనగర్‌తండా మీదుగా మంగళవారం అతిగా మద్యం సేవించిన క్లీనర్ లారీ నడుపుతూ వెళ్తున్నాడు. ఈక్రమంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కొత్తూరుతండాకు చెందిన గుగులోతు రమేష్‌ను భాగ్యనగర్‌తండా సర్కిల్‌లో ఢీకొట్టాడు. ఈ ఘటనలో రమేష్ తలకు గాయం కాగా, క్లీనర్ అలాగే ఇల్లెందు వైపు వెళ్లిపోయాడు. దీంతో స్థానికులతో పాటు కానిస్టేబుల్ సీతారాములు, హోంగార్డు శంకర్ లారీని వెంబడించి ఆలియాతండా వద్ద అడ్డుకున్నారు. ఈక్రమంలో లారీ క్లీనర్‌కు దేహశుద్ధి చేయగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



లారీ క్లీనర్‌తో స్థానికులు, పోలీసులు